సాక్షి
మంచిర్యాల
శనివారం । 22 । జూలై । 2023

గరిష్టం/కనిష్టం
27.0 /24.0
వాతావరణం
జిల్లాలో అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు బలంగా వీస్తాయి. వాతావరణం చల్లగా ఉంటుంది.


బాలింతలను తరలిస్తున్న సిబ్బంది

ఎడతెరిపి లేని వాన


ఎల్లంపల్లి గేట్లు ఎత్తడంతో ఉరకలెత్తుతున్న నీరు


జైపూర్ మండలం పెగడపల్లి ఈదులవాగు వద్ద నిలిచిన రాకపోకలు

- జిల్లాలో తీరిన వర్షపాతం లోటు
- మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు
- వాగులు, కుంటలు, ప్రాజెక్టుల్లోకి వరద
- అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన

ప్రాజెక్టుల వారీగా నీటి వివరాలు

ప్రాజెక్టు	నిల్వ సామర్థ్యం	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
ర్యాలీవాగు	0.408	0.202	630.0	0
గొల్లవాగు	0.567	0.179	223	0
నీల్వాయి	0.846	0.5	243	0
ఎల్లంపల్లి	20.175	18.258	2,61,454	2,53,760

(సాయంత్రం 6గంటల వరకు) (నిల్వ టీఎంసీల్లో, ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో క్యూసెక్కుల్లో)

జిల్లాలో వర్షపాతం వివరాలు(మిల్లీమీటర్లలో)

మండలం	వర్షపాతం
చెన్నూర్	70.6
భీమిని	57.8
కోటపల్లి	55.6
జైపూర్	53.4
భీమారం	48.8
వేమనపల్లి	48.6
దండేపల్లి	47.3
మంచిర్యాల	41.0
జన్నారం	34.3
లక్సెట్టిపేట	20.9
హాజీపూర్	25.8
కాసిపేట	36.8
తాండూర్	26.9
కన్నెపెల్లి	39.7
నెన్నెల	39.0
బెల్లంపల్లి	32.1
మందమర్రి	28.0
నస్పూర్	33.4

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల/మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో గత రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు వర్షపాతం లోటు తీరిపోయింది. వాగులు, వంకలు, కుంటల్లోకి నీరు చేరుతోంది. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా 41.1మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తుండగా గోదావరి నదిలోకి వరద నీరు చేరుతోంది. ప్రాణహిత నదిలో నీటి ఉధృతి పెరిగింది. పత్తి చేన్ల లో నీరు చేరుతోంది. వర్షాల నేపథ్యంలో సహాయక చర్యలకు జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. కంట్రోల్ రూం ఏర్పాటు చేసి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. కలెక్టర్ బాదావత్ సంతోష్, అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, ఆర్డీవో వేణు, తహసీల్దార్ రాజేశ్వర్ పర్యవేక్షించారు. రామగుండం సీపీ రెమా రాజేశ్వరీ, డీసీపీ సుధీర్ రామనాథ్ కేకన్ ఎల్లంపల్లి ప్రాజెక్టును సందర్శించి వరద పరిస్థితిని, ముందు జాగ్రత్తల చర్యలపై అప్రమత్తం చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. జిల్లాలో మొత్తం 890చెరువులు ఉండగా వరదలతో జలకళ సంతరించుకుంటున్నాయి. శుక్రవారం ఎల్లంపల్లి ప్రాజెక్టు 17గేట్లు నీటిని విడుదల చేస్తున్నారు. ఇదే తీరుగా వర్షాలు కురిస్తే వరద పోటు పెరిగే అవకాశం ఉంది.

29 గ్రామాలకు నిలిచిన రాకపోకలు

జిల్లాలోని చెన్నూర్ మండలంలో అత్యధికంగా 70.6 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. భీమిని మండలంలో 57.8 మిల్లీమీటర్లు, కోటపల్లిలో 55.6, జైపూర్‌లో 53.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జిల్లా సరిహద్దు ప్రాంతం వేమనపల్లి, కోటపల్లి అర్జునగుట్ట వద్ద ప్రాణహిత నది ఉధృతంగా ప్రవహిస్తోంది. కడెం ప్రాజెక్టు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరదతో ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటిమట్టం పెరిగింది. దీంతో వరద గేట్లు పైకెత్తి దిగువ గోదావరిలోకి వేల క్యూసెక్కుల నీటిని వదలుతున్నారు.

- నెన్నెల మండలంలోని తోట తిరుపతి ఇంటి గోడకులిింది. ఎర్రవాగు వంతెనపై నుంచి వరద నీరు ప్రవహిస్తుండడంతో ఏడు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వేమనపల్లి మండలం బొందచేను వాగు వద్ద నిర్మాణంలో ఉన్న వంతెన పూర్తి కాకపోవడంతో వరద ప్రవాహంతో కోటపల్లి మండలంలోని 11 గ్రామాలకు, చామనపల్లి వాగు ఉధృతితో తాత్కాలిక వంతెన కొట్టుకుపోవడంతో నెన్నెల మండలం కుశ్నపల్లి 6 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. నీల్వాయి వాగు ప్రాజెక్టు మత్తడి దూకుతోంది. చెన్నూర్ మండలంలోని బతుకమ్మ వాగు వద్ద వంతెన అప్రోచ్ రోడ్డు కోతకు గురికావడంతో ప్రమాదకరంగా మారింది.
- కోటపల్లి మండలం నక్కలపల్లి గొల్లగట్టు వాగు తాత్కాలిక వంతెన తెగిపోవడంతో 2 గ్రామాలకు, పారెపల్లి లోతుఒర్రె ఉధృతితో 6 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. సుపాక, జనుగామ గ్రామాల్లో వందల ఎకరాల్లో పత్తి చేను నీట మునిగింది.
- జిల్లా కేంద్రంలో రాళ్లవాగుకు వరద పెరిగింది. బెల్లంపల్లి పట్టణంలో రామ్‌నగర్ వాగుకు వరద పెరిగింది. జైపూర్ మండలం పెగడపల్లిలో వాగు ఉప్పొంగడంతో సమీప గ్రామాలకు రాకపోకలకు అంతరాయం కలిగింది. కోటపల్లి మండలం రాపన్‌పల్లి వద్ద ప్రాణహిత ఉప్పొంగి ప్రవహిస్తోంది. దీంతో జిల్లా కేంద్రంతో సహా, పట్టణాల్లో కరెంట్ నిలిపివేశారు.

అన్నదాతల్లో హర్షం

వరుసగా కురుస్తున్న వర్షాలతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వర్షాలు కురవడం ఆలస్యం కావడం, పంటల సాగు సమయం ఎత్తిపోతుండడంతో రైతులు ఆందోళనకు గురవుతుండడం తెలిసిందే. ఆలస్యమైనా నాలుగు రోజుల నుంచి వరుసగా వర్షం పడుతుండడంతో కుంటలు, చెరువులకు భారీగా వరద నీరు చేరుతోంది.

వరద గోదావరి

- ఎల్లంపల్లి ప్రాజెక్టు 25 గేట్లు ఎత్తివేత
- మూడు లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో


వరద నీటిని పరిశీలిస్తున్న సీపీ, డీసీపీ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): వర్షాలు, ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదనీటితో హాజీపూర్ మండలం గుడిపేట శివారులోని గోదావరి నదిపై ఉన్న ఎల్లంపల్లి ప్రాజెక్టు నిండుకుండలా మారింది. దాదాపుగా మూడు లక్షల క్యూసెక్కుల వరకు ఇన్‌ఫ్లో వస్తోంది. శుక్రవారం ఉదయం 10 గేట్లు ఎత్తగా సాయంత్రం వరకు అదనంగా మరో 15 గేట్లతో కలిపి మొత్తం 25 గేట్ల ద్వారా వరద నీటిని గోదావరి నదిలోకి వదులుతున్నారు. ప్రాజెక్ట్‌లో ఒక్కరోజులోనే 3 టీఎంసీల నీటి సామర్థ్యం పెరిగింది. గురువారం రాత్రి వరకు 15 టీఎంసీలు ఉండగా శుక్రవారం ఉదయం వరకు 18 టీఎంసీలు దాటింది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటిమట్టం 20.175 టీఎంసీలకు గాను 18.296 టీఎంసీల నీటిమట్టంతో ఉంది. ఇన్‌ఫ్లో కింద ఎగువ ప్రాంతాల నుంచి వరద నీటితో దాదాపు 3 లక్షల క్యూసెక్కులు ప్రాజెక్టులోకి చేరుతుండగా అంతే మొత్తంలో దిగువకు వెళ్తోంది. హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ పథకానికి 110 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు.

పర్యాటకుల తాకిడి..

ప్రాజెక్ట్ గేట్లను ఎత్తడంతో గోదావరి నదిలోకి వరద నీరు ఉరకలేస్తోంది. దీంతో దృశ్యాలను తిలకించేందుకు పర్యాటకులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పర్యాటకులను అదుపు చేసేందుకు మంచిర్యాల రూరల్ సీఐ తోట సంజీవ్, ఎస్సై నరేశ్‌కుమార్ పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుతానికి ప్రాజెక్ట్‌పై రాకపోకలు నిషేధించారు.

ప్రాజెక్ట్‌ను సందర్శించిన సీపీ

ప్రాజెక్ట్‌ను రామగుండం సీపీ రెమా రాజేశ్వరి శుక్రవారం సందర్శించారు. గేట్ల ఎత్తివేతను పరిశీలించి గోదావరిలో కలుస్తున్న వరదనీటిని పర్యవేక్షించారు. ప్రాజెక్ట్ ఈఈ విష్ణుప్రసాద్, డీఈ బుచ్చిబాబులతో మాట్లాడి నీటిమట్టం, గేట్ల ఎత్తివేత, ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటి వివరాలను తెలుసుకున్నారు. వరద ముప్పుపై అప్రమత్తంగా ఉంటూ పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అనంతరం గేట్ల ఎత్తివేత, ఉరకలేస్తున్న వరద నీటితోపాటు గోదావరిలో కలుస్తున్న నీటిని తన మొబైల్‌ఫోన్‌తో ఫొటోలు, వీడియో తీశారు. మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాథ్‌కేకన్, జైపూర్ ఏసీపీ మోహన్, పెద్దపల్లి డీసీపీ వైభవ్‌గైక్వాడ్, ఏసీపీ తిరుపతిరెడ్డి, గోదావరిఖని ఏసీపీ తులా శ్రీనివాసరావు, సీఐలు తోట సంజీవ్, కృష్ణ, ఎస్సైలు నరేశ్‌కుమార్, సంతోశ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎంసీహెచ్‌కు వరద ముప్పు

- జీజీహెచ్‌కు గర్భిణులు, బాలింతల తరలింపు
- గత ఏడాది జూలై 13న మునిగిన ఎంసీహెచ్
- ఈ ఏడాది జనవరి 18న వైద్య సేవలు పునఃప్రారంభం
- వరద భయంతో మరోసారి మూసివేత


సామగ్రి తరలింపు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని గోదావరి నది ఒడ్డున ఉన్న మాతాశిశు ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్)కు మరోసారి వరద ముప్పు పొంచి ఉంది. ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. వచ్చిన నీటిని వచ్చినట్టే దిగువకు వదులుతున్నారు. గతేడాది మాదిరిగా ఎంసీహెచ్ మునిగే సమయం వరకు వేచి చూడకుండా ముందు జాగ్రత్తగా శుక్రవారం 125 మంది బాలింతలు, గర్భిణులను ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి(జీజీహెచ్)కు తరలించారు. వీరిలో 25 మందిని డిశ్చార్జి చేసినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరిశ్చంద్రారెడ్డి తెలిపారు. కాగా, గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు జూలై 13న ఎంసీహెచ్ భవనం మొదటి అంతస్తు పూర్తిగా వరద నీటిలో మునిగింది. అంతకుముందు రోజు రాత్రే బాలింతలు, గర్భిణులను జీజీహెచ్‌కు తరలించడంతో ప్రాణహాని తప్పింది. మందులు, వైద్య పరికరాలు, బెడ్‌లు, ఇతరత్రా సామగ్రి, కేసీఆర్ కిట్లు పూర్తిగా వరద నీటిలో మునిగిపోయి రూ.కోట్ల నష్టం మిగిలింది. ఈసారి వరదల్లో నష్టం వాటిల్లకుండా వైద్యాధికారులు ముందస్తు చర్యలు తీసుకున్నారు. 102 వాహనాలు, ప్రభుత్వ అంబులెన్సులు, ఆటోల్లో గర్భిణులు, బాలింతలతోపాటు మందులు, సామగ్రి, పడకలు తరలించారు. మొదటి అంతస్తులోని సామగ్రిని తరలించడంతో కొంత వరకు నష్టాన్ని నివారించేందుకు అవకాశం ఏర్పడింది.

బాలింతల బాధ వర్ణనాతీతం

ఎంసీహెచ్‌లో ప్రతీరోజు 150 మందికి పైగా ఓపీకి వస్తుండగా, నెలలో 300లకు పైగా ప్రసవాలు జరుగుతున్నాయి. వరద ముప్పుతో బాలింతలు, గర్భిణులు, చిన్నారులను తరలించే సమయంలో ఆపరేషన్ జరిగిన వారి ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి. ఆపరేషన్లు జరిగి కనీసం బెడ్‌లో నుంచి లేవలేని పరిస్థితిలో ఉన్న వారిని మొదటి అంతస్తులో నుంచి వీల్‌చైర్‌లో బయటకు తీసుకువచ్చి అంబులెన్సులో రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న జీజీహెచ్‌కు తరలించారు. అంబులెన్సులో ఎక్కేందుకు, దిగి ఆసుపత్రిలోకి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలువురు బాలింతలకు కుట్లు వేసిన చోట రక్తస్రావం కావడం, నొప్పులతోనే గడపాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఏటా ఇదేతంతు..?

మాతాశిశు ఆరోగ్య కేంద్రాన్ని 2018లో రూ.17.80 కోట్లతో నిర్మాణం చేపట్టి, 2022లో వినియోగంలోకి తెచ్చారు. ఊరి చివరి గోదావరి నది ఒడ్డున నిర్మించడంతో రవాణా సౌకర్యం లేకపోవడం, గోదావరి నది వరద ముప్పు పొంచి ఉండడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. 2022 మార్చిలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి టి.హరీష్‌రావు ప్రారంభించగా, అదే ఏడాది మేలో ఎంసీహెచ్‌లో వైద్య సేవలు ప్రారంభించారు. రెండు నెలలు గడవక ముందే వరదలో ఎంసీహెచ్ మునిగిపోయింది. ఆరు నెలలు జీజీహెచ్‌లోనే ఎంసీహెచ్ నిర్వహించి ఈ ఏడాది జనవరిలో పునఃప్రారంభించారు. జీజీహెచ్‌కు ఎదురుగా ఉన్న ఆర్అండ్‌బీ ఆవరణలో నిర్మించి ఉంటే ప్రజలకు రవాణా కష్టాలతోపాటు వరద ముప్పు ఉండేది కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రాజెక్టులు, వాగుల్లోకి వరదనీరు చేరుతోందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర సేవలకు అధికార యంత్రాంగం అందుబాటులో ఉంటుందని కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, ఆర్డీవో వేణు, తహసీల్దార్ రాజేశ్వర్‌తో కలిసి జిల్లా కేంద్రలోని గోదావరి నది తీరం, ఎన్‌టీఆర్‌నగర్, రామ్‌నగర్, రాళ్లవాగు ప్రాంతాలను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సహాయార్థం సమీకృత కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ నం.08736–250501 ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం మాతాశిశు కేంద్రాన్ని ఆర్ఎంఓ భీష్మతో కలిసి సందర్శించి వార్డులు, ల్యాబ్ పరిశీలించారు. నస్పూర్ మండలం తోళ్లవాగు ప్రాంతాన్ని పరిశీలించి అధికారులకు సూచనలు, సలహాలు చేశారు.

న్యూస్‌రీల్

పాఠ్య పుస్తకాలొచ్చాయ్

మంచిర్యాలఅర్బన్: నూతన విద్యాసంవత్సరం ప్రారంభమై నెలన్నర దాటిన తర్వాత ఎట్టకేలకు శుక్రవారం పాఠ్యపుస్తకాలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు చేరాయి. హైదరాబాద్ నుంచి ఆర్టీసీ కార్గో సర్వీసు ద్వారా నేరుగా కళాశాలలకు సరఫరా చేశారు. ఒక్కో సర్వీసుకు 10 నుంచి 11 కళాశాలల పుస్తకాలు కేటాయించారు. మూడు సర్వీసుల ద్వారా జిల్లాలోని కళాశాలలకు వెళ్లి పుస్తకాలు అందజేస్తున్నారు. మంచిర్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలకు 2300, మోడల్ స్కూల్–కళాశాలలో 2076, కేజీబీవీకి 570, ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్ 560 పుస్తకాలు అందజేశారు. సోమవారం నాటికి అడ్మిషన్లు పొంది టీసీలు అప్పగించిన ప్రతీ విద్యార్థికి పాఠ్యపుస్తకాలు అందిస్తారని డీఐఈవో శైలజ తెలిపారు.

‘అవకతవకలు లేవు’

మంచిర్యాలఅర్బన్: మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయుల ద్వారా వచ్చిన విజ్ఞాపనలు, విద్యార్థుల శ్రేయస్సు దృష్ట్యా ఉపాధ్యాయులను సర్దుబాటు చేసినట్లు డీఈవో యాదయ్య తెలిపారు. అవకతవకలు, పైరవీలకు తావు లేకుండా నిబంధనల ప్రకారం టీచర్లు అవసరం ఉన్న పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను బట్టి సర్దుబాటు చేశామని పేర్కొన్నారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలి

మంచిర్యాలటౌన్: ఖాళీల కొరత, డిపెండెంట్ ఉద్యోగుల కుటుంబ సభ్యుల విజ్ఞప్తి మేరకు వెంటనే కారుణ్య నియామకాలు చేపట్టాలని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి అన్నారు. స్థానిక టీఎన్జీవోస్ భవన్‌లో శుక్రవారం మాట్లాడారు. జిల్లాలోని 45 మందికి కారుణ్య నియామకాలు అందనున్నట్లు తెలిపారు. జిల్లా కార్యదర్శి రామ్మోహన్, కేంద్ర సంఘం కార్యదర్శి మల్లయ్య, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు శ్రీపతి బాపురావు పాల్గొన్నారు.

అభిమాన నేతకు కన్నీటి వీడ్కోలు

- జోరు వానలోనూ ఐదు గంటలు సాగిన అంతిమయాత్ర
- అధికార లాంఛనాలతో సీఆర్ఆర్ అంత్యక్రియలు
- తరలివచ్చిన అభిమానులు, రాజకీయ నాయకులు
- జనసంద్రమైన ఆదిలాబాద్


రోదిస్తున్న సీఆర్ఆర్ భార్య లక్ష్మిదేవి


అశేష అభిమానుల మధ్య రాంచంద్రారెడ్డి అంతిమయాత్ర

కైలాస్‌నగర్: ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత చిల్కూరి రాంచంద్రారెడ్డి అంత్యక్రియలు శుక్రవారం ప్రభుత్వ అధికార లాంఛనాలతో ముగిశాయి. ఎడతెరిపి లేని వానలోనూ వరుణుడే చిన్నబోయేలా అంతిమయాత్ర సాగింది. అశేష జనవాహిని తరలిరాగా డప్పుచప్పుళ్లు, అభిమానుల నృత్యాల నడుమ సాగిన తీరు సీఆర్ఆర్‌పై ప్రజల్లో ఉన్న అభిమానాన్ని చాటింది. స్థానిక శాంతినగర్‌లోని నివాసం నుంచి ఉదయం 11 గంటలకు ప్రారంభమైన అంతిమయాత్ర పట్టణ ప్రధాన వీధుల గుండా మధ్యాహ్నం 3 గంటలకు తిర్పెల్లిలోని హిందూ శ్మశానవాటికకు చేరుకుంది. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఆయన భౌతికకాయాన్ని ఉంచి అంతిమయాత్ర చేపట్టారు. పార్టీలకతీతంగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు. దారి పొడవునా సీఆర్ఆర్ అమర్ రహే నినాదాలతో హోరెత్తించారు. పట్టణంలోని ప్రధాన వీధుల్లో సీఆర్ఆర్‌కు నివాళులర్పిస్తూ పార్టీ నాయకులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

అధికార లాంఛనాలతో..

అభిమానుల అశ్రునయనాల నడుమ ప్రభుత్వ అధికార లాంఛనాలతో సీఆర్ఆర్ అంత్యక్రియలు నిర్వహించారు. పోలీసులు మూడు రౌండ్లు గాల్లో కాల్పులు జరిపి గౌరవ వందనం సమర్పించిన అనంతరం ఆయన చితికి తన మేనల్లుడు అల్లూరి సంజీవ్‌రెడ్డి నిప్పంటించారు. పోలీసుల గౌరవ వందన సమయంలోనూ సీఆర్ఆర్ జిందాబాద్ నినాదాలతో శ్మశానవాటిక మారుమోగింది. రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, సాగునీటి అభివృద్ధి సంస్థ చైర్మన్ ఎస్.వేణుగోపాలాచారి, ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి, ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు జోగు రామన్న, రాథోడ్ బాపూరావు, ఎస్.దివాకర్‌రావు, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు వెంకట్రావ్, డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్‌లు అడ్డి భోజారెడ్డి, తిప్పని లింగయ్య, మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్, వణీ మాజీ ఎమ్మెల్యే వామన్‌రావు కాసావార్, బీజేపీ నాయకులు లోక ప్రవీణ్‌రెడ్డి, సి.సుహాసినీరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఆర్.మనోహర్, యూనీస్ అక్బానీ, మాజీ మున్సిపల్ చైర్మన్ మనీషా తదితరులు పాల్గొని కడసారి వీడ్కోలు పలికారు.

ప్రముఖుల నివాళి

సీఆర్ఆర్ భౌతికకాయాన్ని హైదరాబాద్ నుంచి గురువారం అర్ధరాత్రి ఆదిలాబాద్ పట్టణం శాంతినగర్‌లోని ఆయన స్వగృహానికి తీసుకువచ్చారు. శుక్రవారం ప్రజల సందర్శనార్థం అందుబాటులో ఉంచారు. తమ అభిమాన నేతను కడసారి చూసేందుకు ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచే రాకుండా మహారాష్ట్ర, రాష్ట్రంలోని ఇతర జిల్లాల నుంచి సైతం పార్టీలకు అతీతంగా ప్రజాప్రతినిధులు, అభిమానులు, నాయకులు తరలివచ్చారు. ఆయన భౌతికకాయం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, నరేశ్ జాదవ్ తదితరులు సీఆర్ఆర్ పార్థివదేహంపై కాంగ్రెస్ జెండా కప్పి నివాళులర్పించారు. ఎమ్మెల్యేలు జోగు రామన్న, రాథోడ్ బాపూరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, కాంగ్రెస్ సీనియర్ నేతలు వి.హనుమంత్‌రావు, కోదండరెడ్డి, మాజీ మంత్రి గడ్డం వినోద్, మాజీ ఎమ్మెల్యే గడ్డం అరవింద్‌రెడ్డి తదితరులు నివాళులర్పించారు.


ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మధుయాష్కీ నివాళులు


అంత్యక్రియలకు హాజరైన మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, నాయకులు

వంతెనను పరిశీలించిన సీపీ


అన్నారం బ్యారేజీ వద్ద కలెక్టర్ సంతోష్, సీపీ రెమా రాజేశ్వరి

చెన్నూర్/చెన్నూర్‌రూరల్/కోటపల్లి: భారీ వర్షాల కు చెన్నూర్‌లోని బతుకమ్మ వాగు వంతెన సైడ్‌వాల్స్ కుంగిపోవడంతోపాటు అప్రోచ్ రోడ్డు కోతకు గురి కావడంతో రామగుండం సీపీ రెమా రాజేశ్వరి శుక్రవారం పరిశీలించారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. చెన్నూ ర్ మండలం సుందరసాల గ్రామ సమీపంలోని అన్నారం (సరస్వతి) బ్యారేజీని కలెక్టర్ బాదావత్ సంతోష్, సీపీ రెమా రాజేశ్వరి పరిశీలించారు. కోటపల్లి మండలం రాపన్‌పల్లి ప్రాణహిత నదిపై అంతర్రాష్ట్ర వంతెనను సందర్శించి వరద ఉధృతిని పరిశీలించా రు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చేపల వేటకు వెళ్లవద్దని తెలిపారు. పడవ ప్రయాణాలు నిలిపివేసేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మంచిర్యాల డీసీపీ సుధీర్‌రాంనాథ్ కేకన్, జైపూర్ ఏసీపీ మోహన్, చెన్నూర్ పట్టణ, కోటపల్లి సీఐలు వాసుదేవరావు, విద్యాసాగర్‌రావు, తహసీల్దార్ శ్రీనివాస్ దేశ్‌పాండే తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యాసంస్థలకు సెలవు

మంచిర్యాలఅర్బన్: జిల్లాలోని అన్ని పాఠశాలలకు శనివారం సెలవు పొడిగించారు. రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి ఆదేశాల మేరకు భారీ వర్షాల కారణంగా అన్ని యాజమాన్యాల పాఠశాలలకు సెలవు ప్రకటించినట్లు డీఈవో యాదయ్య తెలిపారు. ఆదేశాలను తప్పనిసరిగా పాఠశాలల యాజమాన్యాలు పాటించాలని పేర్కొన్నారు.

క్లుప్తంగా

నేడు నవోదయ ఇంటర్ ఫస్టియర్ ప్రవేశ పరీక్ష

కాగజ్‌నగర్‌టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా జవహర్ నవోదయ విద్యాలయాల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం శనివారం ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ చక్రపాణి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. పరీక్షకు కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా 719 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. కాగజ్‌నగర్ పట్టణంలోని జవహర్ నవోదయ విద్యాలయంతో పాటు సెయింట్ క్లారిటీ స్కూల్‌లో పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు హాల్ టికెట్లను ఆన్‌లైన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పరీక్ష నిర్వహణ కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి


రజిత (ఫైల్)

కాసిపేట: కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో సోమగూడెంకు చెందిన జనగామ రజిత (40) అక్కడికక్కడే మృతి చెందగా ఆమె భర్త తిరుపతి స్వల్పగాయాలతో బయటపడ్డాడు. ఎస్సై గంగారాం తెలిపిన వివరాల ప్రకారం.. రజిత, తిరుపతి దంపతులు శుక్రవారం బెల్లంపల్లికి ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. ఫోర్‌లేన్ రహదారిపై కల్వరి చర్చి దాటిన తర్వాత బెల్లంపల్లి బైపాస్ వద్ద వెనుక నుంచి వచ్చిన లారీ వీరి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రజిత లారీ టైర్ల కింద పడి అక్కడికక్కడే మృతి చెందగా, తిరుపతికి స్వల్పగాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, రజిత ఇటీవల నూతనంగా ఏర్పడిన టోల్‌ప్లాజాలో స్వీపర్‌గా పనిచేస్తుండగా తిరుపతి సోమగూడెం (బీ) గ్రామపంచాయతీలో కామాటిగా పనిచేస్తున్నాడు. రజిత అనారోగ్యంతో బాధ పడుతుండగా స్టేషన్‌లో ఆర్‌ఎంపీ వద్ద ఇంజక్షన్ వేయించి బ్యాంక్ పనిమీద బెల్లంపల్లికి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. వీరికి ఇద్దరు కుమార్తెలున్నారు. సోమగూడెంలో అందరికి సుపరిచితులు కావడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

కోతకు గురైన రోడ్డు


అదుపుతప్పి పత్తి చేనులో పడిన బైక్

జన్నారం: వర్షాలకు మండలంలోని ధర్మారం -కలమడుగు గ్రామాల మధ్య గల బీటీ రోడ్డు కోతకు గురైంది. అధికారులు మరమ్మతు చేయకపోగా కనీసం సూచిక బోర్డు కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో శుక్రవారం కలమడుగు గ్రామానికి చెందిన రాజు ద్విచక్రవాహనంపై జన్నారానికి వస్తూ రోడ్డు కోతను గమనించకుండా అదుపుతప్పి అందులో పడిపోయాడు. ఈ ప్రమాదంలో అతడికి స్వల్ప గాయాలయ్యాయి. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పంటలకు వరద ముప్పు

- నీరు నిల్వ ఉంటే తెగుళ్ల దాడి
- నివారణ చర్యలు తప్పనిసరి
- వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త శ్రీధర్‌చౌహాన్



మంచిర్యాలఅగ్రికల్చర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో పలుచోట్ల పంట చేన్లు నీట మునిగాయి. కొన్ని ప్రాంతాల్లో వరద తాకిడికి పంటచేన్లలో ఇసుక మేటలు వేశాయి. పంటపొలాల్లో నీరు నిల్వ ఉంటే మొక్కలు కుళ్లిపోయే ప్రమాదముంది. ఇలాంటి సమయంలో సరైన యాజమాన్య పద్ధతులు పాటించకుంటే మొదటికే మోసం వస్తుంది. కాబట్టి వరద ప్రభావిత ప్రాంతాల రైతులు అప్రమత్తంగా ఉండి.. పంటచేన్లలో నీరు నిలిస్తే వెంటనే తొలగించాలని, సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త శ్రీధర్‌చౌహాన్ సూచించారు. ఆయన చేస్తున్న మరిన్ని సూచనలు రైతుల కోసం..

ఇలా చేస్తే మేలు

సాధ్యమైనంత వరకు పొలంలో నీరు నిల్వకుండా చూడాలి. ఒకవేళ నీరు నిలిస్తే కాల్వలు తీసి బయటకు పంపించాలి. వీలైనంత త్వరగా అంతర కృషి చేయాలి. దీంతో భూమిలో తేమ తగ్గి వేర్లకు గాలి, పోషకాలు అంది మొక్కలు త్వరగా సాధారణ స్థితికి వస్తాయి. నీరు బయటకు పంపిన తర్వాత ఎకరాకు 25కిలోల యూరియా, 10 కిలోల పొటాష్‌ను మొక్కకు 5 నుంచి 6 సెంటీమీటర్ల దూరంలో గుంతలు తీసి వేయాలి. పొలంలో తేమ అధికంగా ఉన్నప్పుడు వేర్లు పోషకాలు, నీటిని తీసుకోలేక ఆకులు లేత ఆకుపచ్చ రంగులోకి మారుతాయి. దీంతో పంట పెరుగుదల తగ్గుతుంది. కాబట్టి పంటకు 20 గ్రాముల యూరియా లేదా 10 గ్రాముల పొటాషియం నైట్రేట్‌ను లీటర్ నీటిలో కలిపి ఐదు రోజుల వ్యవధిలో రెండు, మూడుసార్లు పిచికారీ చేస్తే మొక్కలు త్వరగా కోలుకుంటాయి.

పత్తి పంటలో..

భూమి, వాతావరణంలో తేమ అధికంగా ఉన్నప్పుడు పత్తిని ఆకుపచ్చ తెగులు ఆశించే అవకాశం ఉంది. దీని నివారణకు 10 లీటర్ల నీటిలో కాపర్ ఆక్సీక్లోరైడ్ 30 గ్రాములు, గ్రాము స్ట్రెప్టో సైక్లిన్‌ను 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. భూమిలో అధిక తేమ ఉన్నప్పుడు వేరుకుళ్లు తెగులు ఆశించి మొక్కలు చనిపోతాయి. దీని నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ మూడు గ్రాములు లేదా కార్బండిజమ్ రెండు గ్రాములు లీటర్ నీటిలో కలిపి ద్రావణాన్ని తెగులు సోకిన మొక్క మొదళ్లలో పోయాలి.

వరి పంటలో..

ఇప్పటికే వరి నాట్లు వేసినట్లయితే పంటలో ఎక్కువ మోతాదులో నీరు ఉండకుండా చూడాలి. వీలైనంత త్వరగా నిల్వ ఉన్న నీటిని బయటకు పంపించాలి. తరువాత ఎకరాకు 20 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ వేయాలి. ముంపు పాలైన వరి పొలాల్లో తెగుళ్లు వ్యాపించే అవకాశం ఉంది.

తెగుళ్లు.. నివారణ చర్యలు

ఆకుముడుత పురుగు: ఈ పురుగు పత్రహరితాన్ని హరించడంతో ఆకులు తెల్లబడుతాయి. దీని నివారణకు పిలక దశలో చేనుకు అడ్డంగా తాడుతో 2-3 సార్లు లాగితే పురుగులు కిందబడిపోతాయి. క్లోరిపైరిఫాస్ 2.5 మిల్లీలీటర్లు లేదా కార్టాప్‌హైడ్రోక్లోరైడ్ రెండు గ్రాములు లేదా క్లోరాన్ నిలిప్రోల్ 0.4 మిల్లీలీటర్లు లేదా ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా ఫ్లూబెండమైడ్ 20 డబ్ల్యూడీజీ 0.25 గ్రాములు లేదా 48 ఎస్‌సీ 0.1 మిల్లీలీటర్లు లీటర్ నీటిలో కలిపి వాడాలి. లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4 జీ గుళికలు ఎకరాకు ఎనిమిది కిలోలు వేయాలి.

తాటాకు తెగులు: హిస్పాపిల్లా పెద్దపురుగులు ఆకులోని పత్రహరితాన్ని గోకి తినివేయడంతో తెల్లటి చారలు ఏర్పడి ఆకులు ఎండిపోతాయి. దీని నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ లేదా క్లోరిపైరిఫాస్ 2.5 మిల్లీ లీటర్లు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

పొడతెగులు: ఆకులపై మచ్చలు పెద్దగై పాము పొడ మచ్చలుగా ఏర్పడతాయి. మొక్కలు పూర్తిగా ఎండిపోతాయి. దీని నివారణకు హెక్సాకొనజోల్ రెండు మిల్లీ లీటర్లు లేదా వాలిడా మైసిన్ రెండు మిల్లీ లీటర్లు లేదా వాలిడా మైసిన్ రెండు మిల్లీ లీటర్లు లేదా ప్రోపికొనజోల్ మిల్లీ లీటర్ లేదా ట్రిఫ్లాక్సిస్ట్రోబిన్ మరియు టెబ్యుకొనజోల్ 75 డబ్ల్యూజీ 0.4 గ్రాములు లీటర్ నీటిలో కలిపి 15 రోజులకు ఒకసారి చొప్పున రెండుసార్లు పిచికారీ చేయాలి.

అగ్గితెగులు: అగ్గితెగులు నివారణకు ట్రైసైక్లోజోల్ 0.6 గ్రాముల లేదా ఐసోప్రోథయేలేన్ 1.5 మిల్లీ లీటర్లు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

మిరప పంటలో..

అధిక వర్షాలు, అధిక తేమతో మిరపలో ఆకుమచ్చ తెగులు, వేరుకుళ్లు, కాండం కుళ్లు, కొనోఫేరా కొమ్ము కుళ్లు, లద్దెపురుగు ఆశించే అవకాశం ఉంది. సకాలంలో నివారణ చర్యలు చేపట్టాలి.

ఆకుమచ్చ తెగులు: ఆకుల మీద గోధుమ రంగు మచ్చలు ఏర్పడి ఆకులు పండుబారి రాలిపోతాయి. దీని నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 30 గ్రాములు, గ్రాము స్ట్రెప్టోసైక్లిన్ 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

వేరుకుళ్లు తెగులు: మొక్కలు వడలిపోయి ఎండిపోతాయి. దీని నివారణకు లీటర్ నీటిలో మూడు గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ నీటిలో వడలిపోయిన చెట్ల మొదళ్లు, చుట్టుపక్కల తడపాలి.

కాండం కుళ్లు: దీని నివారణకు 1.5 గ్రాముల థయోఫాసెట్ మిథైల్‌ను లీటర్ నీటిలో కలిపి మొక్క కాండం అంతా తడిసేలా పిచికారీ చేయాలి.

కానోఫోరా కొమ్ముకుళ్లు తెగులు: ఈ తెగులు సోకిన లేత చిగుళ్లు మాడిపోయి కణుపుల వద్ద కొమ్మలు కుళ్లి విరిగిపోతాయి. దీని నివారకు ఆక్సీక్లోరైడ్ 30 గ్రాములు, గ్రాము స్ట్రెప్టోక్లిన్ 10 లీటర్ల నీటిలో కలిపి వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.

లద్దెపురుగు: మిరపను లద్దెపురుగు సోకే అవకాశం ఉంది. దీని నివారణకు థయోడికార్బ్ గ్రాము లేదా క్లోర్‌ఫెన్‌పైర్ రెండు మిల్లీ లీటర్లు లేదా స్పైనోసాడ్ 0.38 మిల్లీ లీటర్లు లేదా క్లోరిపైరిఫాస్ 2.5 మిల్లీ లీటర్లు లేదా ఎపిసేట్ 1.5 గ్రాములు లేదా క్వినాల్‌ఫాస్ 2 మిల్లీ లీటర్లు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

నిండని గొల్లవాగు ప్రాజెక్ట్

- నాలుగేళ్లుగా ఇదే పరిస్థితి
- పూర్తి సామర్థ్యం 155.00 మీటర్లు
- ఇప్పటివరకు 151.700 మీటర్లే..


గొల్లవాగు ప్రాజెక్ట్‌లోకి వచ్చిన వరద

భీమారం: ఓ వైపు ఎడతెరిపిలేని వర్షాలతో ప్రాజెక్టులు నిండుతుండగా మంచిర్యాల జిల్లా భీమారం సమీపంలోగల గొల్లవాగు ప్రాజెక్ట్ పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. శుక్రవారం నాటికి కూడా ప్రాజెక్టులోకి పూర్తి స్థాయిలో నీరు చేరలేదు. దీంతో ఆయకట్టు రైతులు నిరాశ చెందుతున్నారు. ప్రాజెక్ట్ నిల్వనీటి సామర్థ్యం 155.00 మీటర్లు కాగా, ఇప్పటివరకు 151.700మీటర్లు మాత్రమే నీరు చేరింది. ప్రాజెక్ట్ నిర్మించే సమయంలో ఒక భారీ వర్షానికే నిండుతుందని అధికారులు ప్రకటించారు. 2009 నుంచి 2018వరకు అధికారులు చెప్పినట్లే ఒకే వర్షానికి నిండింది. కాగా, ప్రాజెక్ట్ ప్రధాన కాలువ గొల్లవాగుపైనే కాజిపల్లి వద్ద మరోపెద్ద చెరువు నిర్మించడంతో వరద ప్రవాహం అంతా అందులోకే వెళ్తోంది. ఆ చెరువు నిండిన తర్వాతే గొల్లవాగు ప్రాజెక్టుకు వరదనీరు వస్తోంది. అందుకే ఆగస్టులోనే ప్రాజెక్ట్ జలకళ సంతరించుకోనుంది.

మా డాక్టర్.. మాకు కావాలి

- వర్షంలో ప్లకార్డులతో గిరిజనుల ఆందోళన


పీహెచ్‌సీ వద్ద నిరసన తెలుపుతున్న గిరిజనులు

నార్నూర్(జైనూర్): జైనూర్ మండలంలోని ఉషెగాం ప్రాథమి ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న వైద్యుడు రాజును అక్రమంగా బదిలీ చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం గిరిజనులు ఆందోళనకు దిగారు. ప్లకార్డులు పట్టుకుని ఆస్పత్రి ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ఆర్మీలో విధులు నిర్వహించి గతేడాది నుంచి ఉషెగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న వైద్యుడు రాజును అక్రమంగా లింగాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి బదిలీ చేశారని ఆరోపించారు. మా డాక్టర్ మాకు కావాలని, లేదంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవ్‌రావు సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఐదు రోజుల్లో రీపోస్టింగ్ ఇస్తామని కలెక్టర్ హామీ ఇచ్చినా జిల్లా వైద్యశాఖ కార్యాలయంలోని కిందిస్థాయి అధికారులు అక్రమంగా బదిలీ చేస్తూ వైద్యులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. లింగాపూర్‌లో పనిచేస్తున్న వైద్యుడిని కాగజ్‌నగర్ ప్రాంతానికి బదిలీ చేసి నిస్వార్థంగా పనిచేస్తున్న డాక్టర్ రాజును అక్రమంగా ఎలా బదిలీ చేస్తారని ప్రశ్నించారు. కలెక్టర్ చొరవ తీసుకుని అక్రమ బదిలీని నిలిపి వేయాలని, లేకుంటే కలెక్టరెట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పటేల్, యూత్ పాల్గొన్నారు.

ఆర్కే ఓసీని సందర్శించిన డైరెక్టర్ పీపీ వెంకటేశ్వర్‌రెడ్డి


ఓబీని పరిశీలిస్తున్న డైరెక్టర్

రామకృష్ణాపూర్: మందమర్రి ఏరియాలోని ఆర్కే ఓసీని శుక్రవారం సింగరేణి డైరెక్టర్(ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) వెంకటేశ్వర్‌రెడ్డి సందర్శించారు. ఓసీ వ్యూపాయింట్ నుంచి క్వారీని పరిశీలించారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో ఓబీలో నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సంస్థ నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించేందుకు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. రక్షణ విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం వద్దని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏరియా జీఎం మోహన్ రెడ్డి, ప్రాజెక్ట్ ఆఫీసర్ గోవిందరావు, ఏజీఎం నాగరాజు, మేనేజర్ వెంకటేశ్వర్లు, ఇంజినీర్ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త బ్లాకులు కేటాయించాలి


ఎస్సార్పీ 3 గనిపై మాట్లాడుతున్న నరసింహారావు

శ్రీరాంపూర్: సింగరేణికి కొత్తగా బొగ్గు బ్లాకులను కేటాయించాలని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి మందా నరసింహారావు కేంద్రాన్ని కోరారు. శుక్రవారం ఆయన శ్రీరాంపూర్ ఏరియా వర్క్‌షాప్‌లో అనంతరం ఎస్సార్పీ 3, 3ఏ గనులపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో కార్మికులనుద్దేశించి మాట్లాడారు. ప్రస్తుతం సింగరేణిలోని అన్ని భూగర్భ గనులు మరో 10-15 ఏళ్ల వరకే బొగ్గు నిక్షేపాలు కలిగి ఉన్నాయని, తర్వాత సంస్థకు ప్రమాదం పొంచి ఉందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం సింగరేణిలో వేలానికి పెట్టడానికి పూనుకున్న నాలుగు బొగ్గు బ్లాక్‌లను సంస్థకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ బొగ్గుబ్లాకులను ప్రైవేట్ సంస్థలకు అప్పగించడానికి పిలిచిన టెండర్లను రద్దుచేయాలన్నారు. ఇవి ప్రైవేట్ సంస్థల చేతుల్లోకి వెళ్తే ముస్ముందు సింగరేణి భవిష్యత్ ప్రశ్నార్థకంలో పడే ప్రమాదముందని ఆందోళన వ్యక్తంజేశారు. దీన్ని కార్మికవర్గం తీవ్రంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే కోయగూడెం బ్లాక్‌కు అరబిందో అనే ఫార్మా కంపెనీ టెండర్ వేయడం జరిగిందని, వీళ్లకు ఏమాత్రం అనుభవం లేదని, ఆ కంపెనీకి చెందిన వారు లిక్కర్ కేసులో ఢిల్లీ జైల్లో ఉన్న సంగతి అందరికీ తెలిసిందేనన్నారు. ఇలాంటి దోపిడీదారులకు తెలంగాణలోని బొగ్గు బ్లాకులను బీజేపీ ప్రభుత్వం ఎలా కట్టబెడుతుందని ప్రశ్నించారు. యూనియన్ బ్రాంచ్ అధ్యక్షుడు గుల్ల బాలాజీ, కార్యదర్శి గోదారి భాగ్యరాజ్, నాయకులు కస్తూరి చంద్రశేఖర్, వెంగళ శ్రీనివాస్, సంఘం రాజయ్య శ్రీధర్, ఆవునూరి మహేశ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురి ప్రాణాలను కాపాడిన ఈఎంటీ


గంగుబాయి, శిశువులతో ఈఎంటీ శ్రీనాథ్

కెరమెరి(ఆసిఫాబాద్): 108 అంబులెన్స్‌లో ఓ నిండు గర్భిణికి ఈఎంటీ ప్రసూతి చేసి ముగ్గురి ప్రాణాలు కాపాడారు. వివరాలు.. కెరమెరి మండలం పెద్ద సాకడ గ్రామానికి చెందిన ఆత్రం గంగుబాయికి పురిటి నొప్పులు రాగా శుక్రవారం కుటుంబీకులు ఆమెను కెరమెరి పీహెచ్‌సీలో చేర్పించారు. కవల పిల్లలున్నారని, బీపీ కూడా అధికంగా ఉందని గుర్తించిన వైద్య సిబ్బంది మెరుగైన వైద్యం కోసం ఆమెను ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్‌చేశారు. 108 అంబులెన్స్‌లో ఉట్నూర్‌కు తరలిస్తున్న క్రమంలో జైనూర్ మండలం ఉశేగాం సమీపంలో ఆమెకు నొప్పులు అధికమయ్యాయి. దీంతో అంబులెన్స్‌లోనే ఈఎంటీ శ్రీనాథ్ డెలివరీ చేయగా కవలలకు జన్మనిచ్చింది. బీపీ అధికంగా ఉన్నప్పటికీ ధైర్యంగా డెలివరీ చేసి ముగ్గురి ప్రాణాలు కాపాడిన ఈఎంటీ శ్రీనాథ్‌ను పలువురు అభినందించారు. ప్రస్తుతం తల్లీ, బిడ్డలు క్షేమంగా ఉన్నారు. కాగా, గంగుబాయికి ఇది రెండో కాన్పు. ఈఎంటీ శ్రీనాథ్‌తో పాటు పైలెట్ రమాకాంత్ ఉన్నారు.

ఒకరికి మూడేళ్ల జైలు

చెన్నూర్: మండలంలోని ముత్తరావుపల్లి గ్రామానికి చెందిన ఆకుదారి బానేశ్ ఇంట్లోకి పైడిపల్లి రాజశేఖర్ అక్రమంగా చొరబడి గాయపర్చి బెదిరించగా అతడికి మూడేళ్ల జైలు శిక్ష రూ.10 వేల జరిమానా విధించినట్లు సీఐ వాసుదేవరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ముత్తరావుపల్లి గ్రామానికి చెందిన ఆకుదారి బానేశ్‌కు ఆరేళ్ల క్రితం మానస అనే మహిళతో వివాహమైంది. ఎదురింట్లో ఉండే నర్సక్కపేట గ్రామానికి చెందిన పైడిపల్లి రాజశేఖర్‌తో మానస అక్రమ సంబంధం పెట్టుకుంది. ఈ విషయం తెలిసిన బానేశ్ మానసకు విడాకులిచ్చాడు. అప్పటి నుంచి ఇరువురు వేర్వేరుగా జీవనం సాగిస్తున్నారు. కాగా, 30 మే 2019న రాజశేఖర్ బానేశ్ ఇంట్లో అక్రమంగా చొరబడి కొట్టడమే కాకుండా అతడిని బెదిరించాడు. ఈ మేరకు బానేశ్ పోలీసుల కు ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్సై విక్టర్ కేసు నమోదు చేశారు. శుక్రవారం సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి విచారించగా రాజశేఖర్ బానేశ్‌ను గాయపర్చడమే కాకుండా బెదిరింపులకు పాల్పడినట్లు నేరం రుజువైంది. దీంతో మెజిస్ట్రేట్ సంపత్ రాజశేఖర్‌కు మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10వేల జరిమానా విధించారు.

భూగర్భ గనుల్లో ఉత్పత్తి లక్ష్యంపై సమీక్ష


సమావేశంలో మాట్లాడుతన్న వెంకటేశ్వర్‌రెడ్డి

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని జీఎం కార్యాలయ ఆవరణలోగల కాన్ఫరెన్స్ హాల్‌లో ఏరియాలోని భూగర్భ గనుల్లో బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనపై శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏరియా జీఎం మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వర్ రెడ్డి (పీపీ) ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వర్షాల కారణంగా ఓసీల్లో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం ఏర్పడుతోందని తెలిపారు. భూగర్భ గనుల్లో బొగ్గు ఉత్పత్తి పెంచడానికి తీసుకోవాల్సిన విధివిధానాలను వివరించారు. అనంతరం కేకే ఓసీని సందర్శించి బొగ్గు ఉత్పత్తి వివరాలు తెలుసుకున్నారు. ఎస్వోటూ జీఎం రాజేశ్వరరెడ్డి, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, ఓసీల ప్రాజెక్ట్ అధికారులున్నారు.

గుడ్లబోరి రేషన్ డీలర్‌పై కేసు


విచారణ చేస్తున్న అధికారులు

కౌటాల: మండలంలోని గుడ్లబోరి రేషన్‌డీలర్ ఎల్.నిర్మలపై కేసు నమోదు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ శ్రీనివాస్ తెలిపారు. డీలర్ నిర్మల సక్రమంగా పీడీఎస్ బియ్యం పంపిణీ చేయడం లేదని లబ్ధిదారులు ఫిర్యాదు చేయగా శుక్రవారం గ్రామంలో అధికారులు విచారణ చేపట్టారు. రేషన్ దుకాణాన్ని తనిఖీ చేసి బియ్యం నిల్వలు పరిశీలించారు. 23.14 క్వింటాళ్ల బియ్యం తక్కువగా ఉన్నట్లు తేలిందని డీటీ తెలిపారు. దీంతో నిర్మలపై 6-ఏ కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. రేషన్ బియ్యాన్ని ఎవరైనా అమ్ముకున్నట్లయితే వారి రేషన్‌కార్డు రద్దు చేస్తామన్నారు. డీలర్లు రేషన్ బియ్యానికి బదులు డబ్బులు ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు శ్యామ్‌లాల్, రాజ్‌కుమార్, కౌటాల ఆర్‌ఐ దిలీప్ పాల్గొన్నారు.

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

రామకృష్ణాపూర్: స్థానిక రవీంద్రఖని రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ కే సంపత్ తెలిపారు. మృతదేహం గుర్తుపట్టని విధంగా నుజ్జునుజ్జయిందని పేర్కొన్నారు. మృతుడి వయస్సు సుమారు 55 ఏళ్లు ఉంటుందని తెలిపారు. కాగా, ప్రమాదవశాత్తు రైలు నుంచి పడి మృతి చెందాడా? లేక ఆత్మహత్యకు పాల్పడ్డాడా? అనేది విచారణలో తేలాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సంపత్ తెలిపారు.

తెగిన కన్నెపల్లి మత్తడి జాలి

- దిగువకు వెళ్లిన చేపలు
- సుమారు రూ.10లక్షల నష్టం
- ఆందోళనలో మత్స్యకారులు


చేపలు పడుతున్న స్థానికులు

కౌటాల: మండలంలోని కన్నెపల్లి చెరువులో మత్స్య పారిశ్రామిక సంఘం ఆధ్వర్యంలో కొన్నేళ్లుగా చేపలు పెంచుతున్నారు. గతేడాది సంఘం సభ్యులు చెరువులో రూ.లక్షా 80 వేల విలువైన 2.40 లక్షల చేపపిల్లలు వదిలారు. చెరువు మత్తడి నుంచి చేపలు వెళ్లకుండా జాలి ఏర్పాటు చేశారు. శుక్రవారం వేకువజామున కురిసిన భారీ వర్షానికి జాలి తెగి చెరువులోని వంద క్వింటాళ్లకు పైగా పెద్ద చేపలు వెళ్లిపోయినట్లు సంఘం అధ్యక్షుడు ఎడ్ల భీమయ్య తెలిపారు. దీంతో సుమారు రూ.10లక్షల నష్టం వాటిల్లిందని పేర్కొన్నాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

చెరువు వద్ద సందడి

కన్నెపల్లి చెరువు మత్తడి వద్ద ఏర్పాటు చేసిన జాలి తెగి చేపలన్నీ దిగువకు వెళ్తుండగా స్థానికులు, చుట్టుపక్కల గ్రామాలకు చెందిన సుమారు 300 మంది శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు గురుడుపేట వాగులో చేపలు పట్టేందుకు బారులు తీరారు. దీంతో చెరువు వద్ద సందడి నెలకొంది. పలువురు వందల కిలోల చేపలు పట్టి గ్రామాల్లో రూ.150కి కిలో చొప్పున విక్రయించారు.

వీధి కుక్క స్వైర విహారం

- ఆరుగురికి గాయాలు

తాండూర్: మండలంలోని గోపాల్‌నగర్‌లో ఓ వీధి కుక్క శుక్రవారం గ్రామంలో స్వైర విహారం చేసింది. ఇంటిముందు ఉన్న వారిపై దాడి చేసి భయాందోళన కలిగించింది. మడే చందు మూడేళ్ల కుమార్తె అఖిల ఇంటి ముందు ఆడుకుంటుండగా ఒక్కసారిగా వీధి కుక్క దాడి చేసింది. వెంటనే ఇరుగుపొరుగు వారు వచ్చి దానిని తరిమేశారు. చిన్నారికి స్వల్పంగా గాయాలయ్యాయి. అలాగే రోడ్డుమీదుగా నడుచుకుంటూ వెళ్తున్న వారిపైనా దాడి చేసి గాయపర్చింది. చిన్నారితోపాటు మరో ఐదుగురు కుక్కకాటు బాధితులు తాండూర్ పీహెచ్‌సీకి వెళ్లి చికిత్స తీసుకున్నారు. కుక్కను నివారించడానికి సర్పంచ్ బక్కమ్మ పంచాయతీ సిబ్బందిని పురమాయించారు.

తప్పిన ప్రాణాపాయం


వాగులోంచి బైక్‌ను బయటకు తీస్తున్న స్థానికులు

మందమర్రిరూరల్: సారంగపల్లికి చెందిన సుభాన్ అనే యువకుడు శుక్రవారం పాలవాగు దాటబోయి ప్రమాదంలో పడ్డాడు. గ్రామస్తులు సమయానికి చేరుకోగా ప్రాణాపాయం తప్పింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. సారంగపల్లికి చెందిన సుభాన్ మండల కేంద్రానికి బైక్‌పై వచ్చి తిరిగి సారంగపల్లి గ్రామానికి వెళ్తున్నాడు. అదే సమయానికి షిర్కే మూలమలుపు వద్ద పోలీసులు తనిఖీ చేస్తున్నారు. అటు నుంచి వెళ్తే పోలీసులు అడ్డుకుంటారని మరో దారైన శంకర్‌పల్లి గ్రామం మీదుగా వెళ్లాడు. ఆ దారిలో ఉన్న పాలవాగు వరద పెరగడంతో గమనించకుండా ద్విచక్రవాహనంతో వాగులోకి వెళ్లగా వరద ఉధృతికి అదుపుతప్పి పడిపోయాడు. శంకర్‌పల్లి గ్రామస్తులు గమనించి బాధితుడిని బయటకు తీసి కాపాడారు. అతడి ద్విచక్రవాహనాన్ని కూడా బయటకు తీసి అప్పగించారు.

చెక్‌బౌన్స్ కేసులో ఒకరికి జైలు

బెల్లంపల్లి: చెక్‌బౌన్స్ కేసులో ఒకరికి బెల్లంపల్లి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎన్.ముఖేశ్ జరిమానా, ఏడాది జైలు శిక్ష విధిస్తూ శుక్రవారం తీర్పు చెప్పారు. బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధి నంబర్ -2 ఇంక్‌లైన్‌బస్తీకి చెందిన ఎండీ అయూబ్‌ఖాన్ బెల్లంపల్లి కాల్‌టెక్స్‌ఏరియాకు చెందిన నాగారపు సంపత్‌కుమార్ వద్ద 2017లో అప్పుగా రూ.3.18 లక్షలు తీసుకున్నాడు. ఇందుకు బదులుగా అయూబ్‌ఖాన్ సంపత్‌కుమార్‌కు చెక్కు ఇచ్చాడు. ఆ చెక్కును బ్యాంక్‌లో వేయగా బౌన్స్ అయింది. దీంతో సంపత్‌కుమార్ బెల్లంపల్లి జూనియర్ సివిల్ కోర్టులో చెక్‌బౌన్స్ కేసు వేశాడు. ఈ కేసులో వాదోపవాదాల అనంతరం నేరం రుజువు కావడంతో జడ్జి ముఖేశ్ అయూబ్‌ఖాన్‌కు రూ.ఐదు లక్షల జరిమానా, ఏడాది జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

ఓసీపీల్లో స్తంభించిన ఉత్పత్తి


శ్రీరాంపూర్ ఓసీపీలో నిలిచిపోయిన డంపర్లు

శ్రీరాంపూర్: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో సింగరేణి అతలాకుతలం అవుతోంది. బెల్లంపల్లి రీజియన్ పరిధి బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ, మందమర్రి పరిధిలో కేకే ఓసీపీ, ఆర్కేపీ ఓసీపీ, శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్సార్పీ ఓసీపీ, ఇందారం ఓసీపీల్లో బొగ్గు ఉత్పత్తికి తీవ్ర విఘాతం కలుగుతోంది. శుక్రవారం కూడా ఉత్పత్తి పూర్తిగా స్తంభించింది. స్టాక్‌కోల్ అక్కడక్కడ ఉంటే వర్షం తగ్గినప్పుడు లిఫ్ట్ చేస్తున్నారు. అన్ని రీజియన్లలోని ఓసీపీల్లో సింగరేణికి రోజుకు సుమారు 36 వేల టన్నుల ఉత్పత్తికి ఆటంకం కలిగింది. గ్రేడ్ జీ-9 బొగ్గు టన్నుకు రూ.3,800 పలుకుతుంది. దీని ప్రకారం లెక్కించినా రోజుకు కనీసం రూ.13 వేల కోట్ల విలువ చేసే బొగ్గు వర్షం కారణంగా వెలికితీతకు నోచుకోలేదు. అన్ని ఓసీపీల్లో కలిపి రోజుకు సుమారు 3.5 లక్షల క్యూబి క్ మీటర్ల ఓబీ వెలికితీత పనులు ఆగిపోయాయి.

- ఎస్సార్పీ ఓసీపీ, ఇందారం ఓసీపీల్లో 16 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి రావాల్సి ఉండగా పూర్తిగా నిలిచింది. ఓబీ సుమారు లక్షన్నర క్యూబిక్ మీటర్ల వెలికితీత ఆగింది. సుమారు 6 వేల టన్నుల స్టాక్ కోల్ రవాణా చేశారు.
- మందమర్రి పరిధి ఆర్కేపీ ఓసీపీ, కేకే ఓసీపీల్లో 10 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి కావాల్సి ఉండగా వర్షంతో స్తంభించింది. లక్ష క్యూబిక్ మీటర్ల ఓబీ పనులు ఆగిపోయాయి. శుక్రవారం ఒక్క రోజే 35మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.
- బెల్లంపల్లి పరిధి కైరిగూడ ఓసీపీల్లో రోజు 10 వేల టన్నుల ఉత్పత్తి రాగా, పూర్తిగా స్తంభించింది. ఓబీ కూడా లక్ష క్యూబిక్ మీటర్లు ఆగింది. గత మూడు రోజుల్లో కోల్‌యార్డులో ఉన్న 20 వేల టన్నుల స్టాక్ కోల్‌ను లిఫ్ట్ చేశారు.